సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
97053 47483
నంబర్‌ను సంప్రదించండి

సాగరతీరం.. అంధకారం


సోలార్ విద్యుద్దీపాలు వెలగక సాగర తీరంలో కమ్ముకున్న చీకట్లు

- కొద్ది రోజులుగా వెలగని విద్యుద్దీపాలు
- యథేచ్ఛగా అసాంఘిక కార్యకలాపాలు

బీచ్ రోడ్డు: అందమైన సాగరతీరం అంధకారంలో కొట్టుమిట్టాడుతోంది. కొద్ది రోజులుగా సోలార్ లైట్లు వెలగడం లేదు. ఇదే అదనుగా కొంత మంది ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఇంత జరుగుతున్నా జీవీఎంసీ అధికారులు విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేపట్టడం లేదు. పోలీసులు సరైన గస్తీ కూడా నిర్వహించడం లేదు. దీంతో రాత్రి 8 గంటలు దాటిన తరువాత బీచ్ వైపు వెళ్లాలంటే సందర్శకులు భయాందోళనకు గురవుతున్నారు.

- కోస్టల్ బ్యాటరీ నుంచి వీఎంఆర్‌డీఏ పార్కు వరకు పదుల సంఖ్యలో సోలార్ దీపాలను జీవీఎంసీ ఏర్పాటు చేసింది. వాటి నిర్వహణను గాలికి వదిలేయడంతో చాలా లైట్లు పాడైపోయాయి. వైఎంసీఏ నుంచి ఆర్కే బీచ్ రోడ్డులో కూడా చాలా దీపాలు వెలగకపోవడంతో రాత్రి వేళ చీకట్లు కమ్ముకున్నాయి.


తీరంలో మద్యం సీసాలు

- సాయంత్రం తరువాత చాలా మంది సందర్శకులు తీరంలోని ఇసుక తెన్నులపై కూర్చుని అలలను చూస్తూ ఎంజాయ్ చేస్తారు. వారి కోసం పెద్ద పెద్ద ఫోకస్ లైట్స్‌ను జీవీఎంసీ ఏర్పాటు చేసింది. వాటిలో చాలా ఫోకస్ లైట్లు పని చేయకపోవడంతో రాత్రి సమయంలో తీరం చాలా భయంకరంగా కనిపిస్తోంది. దీంతో ఇసుక తెన్నుల వైపు వెళ్లేందుకు సందర్శకులు ఇటీవల ఆసక్తి కనబరచడం లేదు.
- ఇసుక తెన్నుల వైపు ఉన్న ఫోకస్ లైట్స్ పని చేయకపోవడంతో ఆకతాయిలు యథేచ్ఛగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా వైఎంసీఏ ఎదురుగా ఉన్న కొబ్బరి చెట్లు, కోస్టల్ బ్యాటరీ దగ్గర గోకుల్ పార్క్ వెనుక వైపు మందుబాబులు పార్టీలు చేసుకుంటున్నారు. తాగి పడేసిన బీరు, మద్యం సీసాలు ఉదయం పారిశుధ్య సిబ్బందికి దర్శనమిస్తున్నాయి. గతంలో ఇక్కడ గంజాయి విక్రయిస్తూ కూడా పలువురు పట్టుబడిన ఘటనలు ఉన్నాయి.

కానరాని పోలీసుల గస్తీ

గతంలో వైఎంసీఏ ఎదురుగా ఉన్న బీచ్, గోకుల్ పార్కు వద్ద పోలీసులు నిరంతరం గస్తీ కాసేవారు. దీంతో చాలా వరకు అసాంఘిక కార్యకలాపాలకు తావుండేది కాదు. ప్రస్తుతం ఇక్కడ గస్తీ కూడా సరిగ్గా లేకపోవడంతో మద్యం పార్టీలు, గంజాయి విక్రయాలు, తదితర కార్యకలాపాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయని పలువురు సందర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్, సోలార్ దీపాలకు మరమ్మతులు చేపట్టి పోలీసులు నిరంతరం గస్తీ నిర్వహించాలని కోరుతున్నారు.

తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి మేలు


పౌష్టికాహార పదార్థాల ప్రదర్శన


గర్భిణులు, పిల్లలకు తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న ఐసీడీఎస్ సీడీపీవో రమణికుమారి


17వ వార్డు ఆదర్శనగర్‌లో తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పిస్తున్న ఆయా సంస్థల సిబ్బంది

మద్దిలపాలెం: తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని ఐసీడీఎస్ అర్బన్ సీడీపీవో రమణి కుమారి అన్నారు. మద్దిలపాలెం సెక్టార్ పరిధిలో ఇసుకతోట అంబేడ్కర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా గర్భిణులు, బాలింతలు, పిల్లలు తీసుకోవాల్సిన పౌష్టికాహార పదార్థాల ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనలో ఉంచిన ఆకుకూరలు, కూరగాయలు, పాలు, గుడ్లు, బాల సంజీవని కిట్లు, బాలామృతం , చెక్కీలు, పండ్లు తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి విపులంగా వివరించారు. అనంతరం సీడీపీవో మాట్లాడుతూ ప్రతి తల్లి తన బిడ్డకు ఆరు నెలల పాటు పాలు ఇవ్వాలన్నారు. ముఖ్యంగా పుట్టిన బిడ్డకు గంట వ్యవధిలో ముర్రు పాలు ఇవ్వడం మరిచిపోరాదన్నారు. తల్లి పాలు పుట్టిన బిడ్డకు తొలి టీకాలా పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో శ్రీలత, సూపర్‌వైజర్ సెల్వియా, అంగన్‌వాడీ కార్యకర్త ఈర్ల దేవి, సచివాలయం ఏఎన్‌ఎం శైలజా, మహిళా కార్యదర్శులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

శిశువు ఆరోగ్యానికి తల్లిపాలు తప్పనిసరి

ఎంవీపీ కాలనీ: తల్లిపాలతోనే శిశువుకు సంపూర్ణ ఆరోగ్యమని కుశాల్ ప్రాజెక్ట్ సమన్వయకర్త టి.షర్మిల అన్నారు. వాసవ్య మహిళా మండలి, విప్రో కేర్ కుశాల్ మెటర్నిటీ హెల్త్ ప్రాజెక్టు, ఐసీడీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలపై 17వ వార్డు ఆదర్శనగర్‌లోని 123 అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ తల్లిపాలలో పోషకాలతో పాటు విటమిన్స్, మినరల్స్ పుష్కలంగా లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వినేషా, సీడీపీవో శ్రీలత, ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

తల్లిపాలు అత్యంత శ్రేష్టమైనవి

బీచ్ రోడ్డు : పుట్టిన శిశువులకు తల్లిపాలు అత్యంత శ్రేష్టమైనవని నారీ కేర్ సంస్థ వ్యవస్థాపకురాలు గాయత్రీ దేవి కనుమూరి అన్నారు. తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఒక హోటల్‌లో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తల్లిపాలు రోగ నిరోధక శక్తిని పెంచుతాయన్నారు. డబ్బాలు పాలు తల్లిపాలకు ఎంత మాత్రం ప్రత్యామ్నాయం కాదన్నారు.

క్లుప్తంగా

డివైడర్‌పై పూల మొక్కల పెంపకం


ముడసర్లోవ వద్ద బీఆర్‌టీఎస్ డివైడర్‌లో నాటిన పూల మొక్కలు

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డు డివైడర్లపై జీవీఎంసీ అధికారులు పూల మొక్కలు నాటిస్తున్నారు. ఈ రోడ్డులో పచ్చదనంతో పాటు అందం కోసం వివిధ రకాల మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా జీవీఎంసీ సిబ్బంది మంగళవారం ముడసర్లోవ వద్ద రామకృష్ణాపురం కూడలి నుంచి ముడసర్లోవ పార్కు వరకు మొక్కలు నాటారు. గతంలో బీఆర్‌టీఎస్ డివైడర్లలో ఉన్న పూల మొక్కలను సంవత్సరం క్రితం పూర్తిగా తొలగించారు. డివైడర్‌లో మట్టిని సైతం తొలగించి బయట నుంచి తీసుకువచ్చిన కొత్త మట్టి వేశారు. ఆ మట్టిలో ఇప్పుడు మొక్కలు నాటుతున్నారు. దీంతో డివైడర్లు మొక్కలతో కళకళలాడుతున్నాయి.

కృష్ణా కళాశాలలో హిరోషిమా డే


హిరోషిమా డే గురించి వివరిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం: ప్రపంచ హిరోషిమా దేను మద్దిలపాలెం డాక్టర్ వీఎస్ కృష్ణా డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు మాట్లాడుతూ న్యూక్లియర్ పవర్‌ను శాంతియుతంగా ప్రజా ప్రయోజనాలకు ఉపయోగించాలన్నారు. దేశాల మధ్య శాంతియుత సంబంధాలు ఎంతైనా అవసరమన్నారు. హిరోషిమా బాంబు దాడి సంఘటనలతో కూడిన ఫొటో ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కె.వి.ఎస్.మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి కేరళ ఆయుర్వేద శిబిరం

డాబాగార్డెన్స్: ఆయుర్వేద పంచకర్మ విధానం ద్వారా దీర్ఘకాల రోగాలకు చికిత్స అందించేందుకు ఈ నెల 11 నుంచి 13 వరకు కేరళ ఆయుర్వేద శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యరాజ్ ఔషధాలయ మేనేజర్ దినుప్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని రాంనగర్‌లో వైద్యరాజ్ ఔషధాలయంలో ప్రముఖ కేరళ వైద్యుడు డాక్టర్ కేఎం ఉన్నికృష్ణన్ నాయర్ 3 రోజుల పాటు ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. డాక్టర్‌ను సంప్రదించాలనుకునేవారు అపాయింట్‌మెంట్ కోసం 9133106060, 9030568264 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. రాంనగర్ జీవీఎంసీ అవుట్‌గేట్ ఎదురుగా గల వైద్యరాజ్ ఔషధాలయంలో ఈ సేవలు పొందవచ్చన్నారు.

వరద బాధితులను ఆదుకోండి


విరాళాలు సేకరిస్తున్న జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: కేరళలోని వయనాడ్‌లో కొండ చరియలు విరిగి పడిన ఘటనలో బాధిత కుటుంబాలకు విరాళాలిచ్చి ఆదుకుందామంటూ జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నుంచి జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ మంగళవారం విరాళాలు సేకరించింది. ఈ సంసదర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఘటనలో అనేక మంది మృత్యువాత పడగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారని, దీనిని జాతీయ విపత్తుగా భావించి కేంద్ర ప్రభుత్వం వెంటనే బాధిత కుటుంబాలను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో గొలగాని అప్పారావు, ఒమ్మి అప్పారావు, ఈశ్వరరావు, నక్క నాగరాజు, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి నిల్వలే దోమల ఉత్పత్తికి ఆవాసాలు

మద్దిలపాలెం : ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఇళ్లలో నిల్వ నీటిని తొలగించాలని, ఆ నీటి నిల్వలలే దోమల ఉత్పత్తికి ఆవాసాలుగా మారుతాయని జిల్లా మలేరియా విభాగం సబ్ యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్ అన్నారు. పాత వెంకోజీపాలెం, మద్దిలపాలెం, రేసపువానిపాలెం అర్బన్ ఆరోగ్య కేంద్రాలలో నిర్వహిస్తున్న డ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ నిల్వ నీటిని ఎప్పటికప్పుడు తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వారానికి పైగా ఉన్న నీటి నిల్వలో లార్వా ఉత్పత్తి అవుతుందన్నారు. ఇంటి పరిసరాల్లో ఖాళీ టైర్లు, కొబ్బరి బొండాలు ఉంటే వెంటనే తొలగించాలని సూచించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి పరిసరాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మలేరియా సూపర్‌వైజర్ రత్నం, ఆరోగ్య కార్యకర్తలు రెడ్డి, రామునాయుడు, శ్రీనివాసరెడ్డి, జీవీఎంసీ మలేరియా విభాగం సిబ్బంది, యాంటీ లార్వా బృందం సభ్యులు పాల్గొన్నారు.


వెంకోజీపాలెంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్

4 కిలోల గంజాయి పట్టివేత

ఆరిలోవ: నిర్మానుష్య ప్రాంతంలో 8 మంది యువకులు గుట్టుగా పంచుకుంటున్న నాలుగు కిలోల గంజాయిని ఆరిలోవ పోలీసులు పట్టుకున్నారు. ఆరిలోవ ఎస్ఐ కృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆరిలోవ, రవీంద్రనగర్, ఆదర్శనగర్, పాత డెయిరీ ఫారం ప్రాంతాలకు చెందిన ఎనిమిది మంది యువకులు గంజాయికి బానిసయ్యారు. వారు రోజూ బయట గంజాయి కొనుగోలు చేసుకుని వినియోగిస్తుండేవారు. వారంతా తక్కువకు లభిస్తుందనే ఆలోచనతో పాడేరు ప్రాంతం వెళ్లి రెండు ప్యాకెట్లలో 4 కిలోల గంజాయి తీసుకువచ్చారు. మంగళవారం వేకువన ఆరిలోవ ఆఖరి బస్టాప్ సమీపం పొదల చాటున వారంతా ఆ గంజాయిని వాటాలు వేసుకుంటుండగా సమాచారం తెలుసుకున్న ఎస్ఐ కృష్ణ సిబ్బందితో వెళ్లి 8 మంది యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న 4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆదేశాల మేరకు వారిని రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ కృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అంకిత భావంతో చదువుకోవాలి

ఆరిలోవ: సమాజాభివృద్ధికి ప్రతిభావంతులే పునాది అని విశాఖ ఆర్జేడీ బి.విజయభాస్కర్ అన్నారు. విశాఖ వ్యాలీ స్కూల్‌లో మంగళవారం స్కాలర్ బ్యాడ్జి కార్యక్రమం ఘనంగా జరిగింది. నూరు శాతం హాజరు, మార్కులు సాధించిన విద్యార్థులకు ఆయన బ్యాడ్జీలతో పాటు ప్రోత్సాహకాలు అందించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థి దశ చాలా ముఖ్యమైందన్నారు. విద్యార్థులు అంకిత భావంతో చదువుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలకు ప్రతి రోజూ మంచి విషయాలు చెప్పాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్ మాట్లాడుతూ పాఠశాలలో అందిస్తున్న విద్యా విధానం, కల్పిస్తున్న సౌకర్యాలు, ప్రత్యేకతల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విద్యార్థికి ప్రోత్సాహక సర్టిఫికెట్ అందిస్తున్న ఆర్జేడీ విజయభాస్కర్

సైకాలజీ ఇంటర్నల్ ప్రాక్టికల్స్ పరిశీలన

విశాఖ సిటీ: ఏయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్ ద్వితీయ సంవత్సరం మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ సైకాలజీ ఇంటర్నల్ ప్రాక్టికల్‌ను కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు మంగళవారం వ్యాయామ విద్యా విభాగంలో పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. త్వరలో తాను సైకాలజీ తరగతి తీసుకుంటానని తెలిపారు. పాస్ ఎలాంగ్ టెస్ట్, కైనెస్తీషియోమెట్రిక్ టెస్ట్, టాచిస్టోస్కోప్ టెస్ట్, ఫింగర్ డెక్స్‌టిరిటీ టెస్ట్, రియాక్షన్, రెస్పాండ్ టెస్ట్‌ల విధానాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు పరీక్షా విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా వ్యాయామ విద్యా విభాగం హెడ్ ఆచార్య ఎ.పల్లవి, ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎస్.విజయమోహన్, సైకాలజీ ఫ్యాకల్టీ జయరాం, వ్యాయామ విద్యా విభాగం పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఇంటర్నల్ ప్రాక్టికల్స్ పరిశీలిస్తున్న ఏయూ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ఎం.వి.ఆర్.రాజు

చెత్త సేకరణ పక్కాగా జరగాలి

- జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

డాబాగార్డెన్స్ : ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ పక్కాగా జరగాలని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మంగళవారం జోన్–4 పరిధి 28వ వార్డు రామ్‌నగర్, నెహ్రూనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నివాసిత ప్రాంతాల్లో ప్రతిరోజూ క్లాప్ వాహనాల ద్వారా చెత్త సేకరించాలని, కాల్వల్లో నిత్యం వ్యర్థాలను తొలగించి, మురుగునీరు సాఫీగా పోయేలా చూడాలని జోనల్ కమిషనర్ ప్రసాదరావును ఆదేశించారు. వాణిజ్య సముదాయాలు, దుకాణదారులు కాల్వల్లో చెత్త వేయకుండా డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకుని జీవీఎంసీ చెత్త తరలించే వాహనానికి నేరుగా అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లు, కాల్వలు, బహిరంగ ప్రదేశాల్లో నివాసితులు వ్యర్థాలు వేయకుండా వారంలో ఒకసారి ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించాలని, కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోయినందున దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ తదితర విష జ్వరాలు, వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, అందుకు కాల్వల్లో పూడికలతో పాటు ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయించాలన్నారు. నెహ్రూనగర్ దోభీఖానాను ఆనుకుని ఉన్న ప్రధాన కాల్వలో వ్యర్థాలు అధికంగా ఉన్నాయని, వారంలో ఒకరోజు కాల్వలో పూడికలు తొలగించాలని ఏఎంవోహెచ్ డాక్టర్ రాజేష్‌ను కమిషనర్ ఆదేశించారు. నెహ్రూనగర్ ప్రధాన కాల్వను ఆనుకుని ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి పిల్లర్లకు మరమ్మతులు చేపట్టాలని, కాలువలపై ఉన్న పలకలు పూర్తిగా మూసివేయకుండా చెత్త తీసేందుకు వీలుగా పలకలు అమర్చాలని కార్యనిర్వాహక ఇంజినీరు సంతోషిని ఆదేశించారు. పలు చోట్ల కాలువల గుండా తాగునీటి పైపులను గుర్తించి మంచినీటి పైపుల్లోని నీరు కలుషితం కాకుండా నీటిపైపులు క్రమపద్ధతిలో మార్పు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఝాన్సీలక్ష్మి, టీపీవో వినయ్‌ప్రసాద్, సహాయ ఇంజినీర్ జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.


కేబుల్ వైర్లను పరిశీలిస్తూ కాల్వలో పడకుండా చర్యలు చేపట్టాలని ఆదేశిస్తున్న కమిషనర్

‘సంఘం శరణం గచ్ఛామి’ పోస్టర్ ఆవిష్కరణ

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం, అభ్యుదయ ఆర్ట్స్(హైదరాబాద్) సంయుక్తంగా ప్రదర్శించనున్న సంఘం శరణం గచ్ఛామి–డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర నాటక ప్రదర్శన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఏయూ డాక్టర్ బీఆర్.అంబేద్కర్ అసెంబ్లీ హాల్ వేదికగా ఈ నాటక ప్రదర్శన జరుగుతుందని పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య పేటేటి ప్రేమానందం తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కిశోర్‌బాబు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వి.ఆర్.రాజు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, డాక్టర్ జి.వీర్రాజు, డాక్టర్ జి.కె.డి.ప్రసాద్, డాక్టర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

తోపుడు బళ్ల తొలగింపు అన్యాయం

డాబాగార్డెన్స్ : హైకోర్టును తప్పుదోవ పట్టిస్తూ కళాభారతి రోడ్డులో గల తోపుడు బళ్లను తొలగించడం అన్యాయమని ప్రముఖ న్యాయవాది పలకా శ్రీరామమూర్తి అన్నారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం కళాభారతి తోపుడు బండ్ల సంఘం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 30 నుంచి 40 ఏళ్లగా చిరు వ్యాపారులు అక్కడ జీవనం సాగిస్తున్నారని, ప్రభుత్వానికి ఆశీలు కూడా కడుతున్నారని చెప్పారు. వారంతా లైసెన్స్ కలిగి ఉన్నారని, అయితే వీరంతా రోడ్డు మార్జిన్ ఆక్రమించారని ఆ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి హైకోర్టును తప్పుదోవ పట్టిస్తూ ఆర్డర్ తెచ్చారని తెలిపారు. ఆ రోడ్డులో మార్జిన్ లేదన్నారు. లేని మార్జిన్‌కు 188 కోట్లు ఖర్చు చేసినట్టు జీవీఎంసీ పేర్కొందని, ఆ డబ్బులు ఏమయ్యాయని కోర్టులో పిటిషన్ వేయనున్నట్టు తెలిపారు. చిరు వ్యాపారులపై మూర్తి హైకోర్టులో ఏ విధంగా పిటిషన్ వేశారని ప్రశ్నించారు. హఠాత్తుగా నోటీసులు చూపించి దుకాణాలు తొలగించాలంటే, వారంతా ఎక్కడికి వెళ్లిపోతారని మండిపడ్డారు. ప్రభుత్వ అధికారులు, పాలకులు ఈ అన్యాయాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. తోపుడుబండ్ల సంఘం అధ్యక్షుడు బన్నీ మాట్లాడుతూ తాము తొలగించడం లేదని కార్పొరేటర్ మూర్తి, చిరువ్యాపారులు అద్దెకున్న ఇంటి యజమానులతో తమను బెదిరిస్తున్నారని వాపోయారు. సంఘం కార్యదర్శి నిసా మాట్లాడుతూ ఉద్యమానికి నాయకత్వం వహించ వద్దని, తనకు జాతీయ రహదారి పక్కన దుకాణం పెట్టిస్తానని మూర్తి ప్రలోభానికి గురి చేస్తున్నట్టు తెలిపారు. మూర్తిపై సర్వత్రా వ్యతిరేకత వస్తుండడంతో విషయాన్ని పక్కదారి పట్టించేందుకు మాజీ ఎంపీ ఎంవీవీ, జీవీ భూకబ్జాలపై విచారణ చేయాలని మూర్తి ప్రకటన విడుదల చేశారని ఆమె ఎద్దేవా చేశారు. సమావేశంలో వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్, పలువురు సంఘ సభ్యులు, చిరు వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పలకా శ్రీరామమూర్తి

15న ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి


సమావేశంలో మాట్లాడుతున్న మేడపాటి రవీంద్ర

ఎంవీపీ కాలనీ: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 15న ప్రతి పౌరుడు దేశభక్తిని చాటాలని బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర కోరారు. లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన డివిజన్ అధ్యక్షులు, జిల్లా పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు ప్రతి ఇంటిపై ఈ నెల 15న జాతీయ జెండాను ఎగరవేయాలన్నారు.

ఏయూ వీసీ ఆకస్మిక తనిఖీ

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పలు విభాగాలను ఏయూ ఇంచార్జ్ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఫార్మసీ కళాశాల భవనంలో తరగతులు జరుగుతున్న విధానం, ప్రయోగశాలల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం పరీక్షల విభాగాన్ని తనిఖీ చేసి ఉద్యోగుల హాజరు, సరిఫికెట్ల జారీ తదితర అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థులకు సత్వర సేవలు అందించే దిశగా పనిచేయాలని సిబ్బందికి చెప్పారు. వీసీ వెంట ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య గిరిజా శంకర్ తదితరులు ఉన్నారు.


ఫార్మసీ కళాశాలను సందర్శిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

వర్సిటీల్లో మొక్కలు నాటి సంరక్షించండి

విశాఖ సిటీ: విశ్వ విద్యాలయాల పరిసరాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని రాష్ట్ర గవర్నర్ కార్యదర్శి హరిజవహర్‌లాల్ సూచించారు. మంగళవారం రాష్ట్ర విశ్వవిద్యాలయాల వీసీలతో ఆయన వర్చువల్ విధానంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు పాల్గొన్నారు. ప్రధాని మోదీ సూచించిన విధంగా మొక్కలు పెంచడం–పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వడం ప్రధాన కర్తవ్యాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ అబ్దుల్ నజీర్ చెప్పినట్లు వివరించారు. వర్సిటీల్లో మొక్కలు నాటడం, వాటికి జియో ట్యాగ్ చేసి, ప్రతి నెలా ప్రగతిని తమకు పంపాలని సూచించారు. నీడ, పండ్లు ఇచ్చేవి, ఆక్సిజన్ అధికంగా అందించే మొక్కలు నాటాలన్నారు. పరిపాలనా కార్యాలయాలు, పరీక్షల విభాగాల్లో పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత కల్పించాలన్నారు. కార్యాలయాల్లో ఫైల్స్ నిర్వహణ, భద్రపర్చడం, డస్ట్‌బిన్ల ఏర్పాటు, శుభ్రం చేయడం వంటి పనులు సక్రమంగా నిర్వహించేలా పర్యవేక్షణ ఉండాలన్నారు. అనంతరం వీసీలతో మాట్లాడుతూ వర్సిటీల్లో ఈ దిశగా చేపట్టిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఏయూలో స్వచ్ఛభారత్ నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతకు చేపడుతున్న చర్యలను వీసీ ఆచార్య జి.శశిభూషణరావు వివరించారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని ఆందోళన


ఆందోళన చేస్తున్న విద్యార్థులు

సీతమ్మధార: రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఏఐఎస్ఎఫ్ విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వినూత్న రీతిలో కూరగాయలతో విద్యార్థులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా కార్యదర్శి ఉల్లం నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లలో ప్రస్తుత ధరలకు అనుగుణంగా ప్రతి విద్యార్థికి రూ. 2,500 మెస్ చార్జీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న కాస్మొటిక్ చార్జీలు విడుదల చేయాలని, హాస్టళ్లలో ఖాళీగా ఉన్న వార్డెన్, కమాటి, ట్యూటర్, వాచ్‌మేన్, కుక్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. ప్రైవేట్ పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో 77 రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీను, జిల్లా సమితి సభ్యులు శేఖర్, గ్రేస్ ప్రకాష్ కిరణ్, మధు, యేసయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ ఈస్ట్
✆ 7331119904, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ ఈస్ట్
✆ 9010133346
Office mail : sakshiadvtvsp@gmail.com